# పుట్టిన రోజు

నాకు ఇరవయ్యవ సంవత్సరం జొరబడుతూంది ఆనాడు. ఆ అమ్మాయికీ అంతే.

అమ్మ, తన మనస్సులో బెంగలు ఒక ప్రక్కకి నెట్టేసుకొని, వెనకా ముందూ చూడకుండా వైభవంగా చేస్తూంది నా పుట్టిన రోజు పండుగ ఆర్భాటాలు. అమ్మ నాన్నల ఇంటో అదే ఆఖరు పుట్టినరోజు నాకు - నా పెండ్లికి ముందు.

అప్పటి కప్పుడే నాఈడు పిల్లలు - బంధువులూ మిత్రులూ, చాలామంది వచ్చేశారు. అందరమూ మేడమీద చేరాం.

మా కెదురుగా దూరాన ఆకాశపు అంచుల దగ్గరగా బాల సూర్యుడు కుంకుమ పసుపు కలసిన కాంతులు వెదజల్లుతున్నాడు.

మేడక్రింద వీథిలోంచి వివరంలేని సవ్వళ్లు ఏవేవో విన వస్తున్నాయి. - వెర్రిగా వచ్చేపోయే మోటారు కార్ల బోంయ్ బోంయ్‌లూ, వెనకా ముందూ తరుముకుంటూ పోయే స్కూటర్ల టప్ టప్‌లూ, దూసుకుపోతూ సైకిళ్ళ ఇష్ అని వేసే ఈలలూ, రిక్షాల అదలకింపులూ - నవీన నాగరక నగరి నాడీ స్పందన.

మేడమీద మా చుట్టూ పండుగ పరిమళాలు అలుముకున్నాయి. ఒకప్రక్క ఎవ్వరో హేపీ బర్తడే టు యూ అని ఇంగ్లీషులో పాడేస్తున్నారు - ఆటవిడుపుగా.

నా ప్రక్కనించీ, ఎవరో, ఉన్నట్టుండి ఛటుక్కున "అదిగదిగో అటు చూడండర్రా." అని అరిచారు గట్టిగా. "ఆ వచ్చే పిల్లని చూడండి. ఆవిడ నడక చూడండి! ఏమి నడక ! ఏమి స్టైలూ!'' వ్యాఖ్యానించారు.

"అరె! ఆ అమ్మాయినే నిన్న సాయంత్రం చూశాను నేను మా ఇళ్ల దగ్గర. పరధ్యానంగా ఏమీ తోచనట్టు, తిరుగుతూంది. కాస్త మతి స్తిమితం తప్పిందను కుంటాను." అందుకున్నారు మరో వ్యక్తి.

మేడ వసారాలోంచీ కిటికీల్లోంచీ తలలు వంచి మెడలు చాపి చూడ నారంభించారు, చాలామంది.

ఎదురుగా రోడ్డుమీద చక్కటి సలాకులాంటి, పొడుగైన ఆడపిల్ల ఒకతె నడిచి వస్తూంది - ఎంతో సొగసుగా.

వంగి చూసిన రాధ, తల ఎత్తి, "మొన్నెప్పుడో మా ఇంటికి వచ్చింది, ఈ అమ్మాయి. మా అమ్మ కానాడు నోము రోజు. పని తొందరలో. "ఏం కావాలమ్మాయ్?" అని అడిగితే, ఈ అమ్మాయ్ ఏమిటేమిటో గొణిగిందట. ఉద్యోగమో ఏదో గొడవగా అందిట. మన్నించండి, అని ఛటుక్కున, చక్కా వెళ్లిపోయిందిట. భలే గీర్వాణం లాగుంది," అంది యాధాలాపంగా, చేతులో ఉన్న పువ్వుల సరాలు అల్లుతూనే.

అంతలో ప్రభాకర్ అందుకున్నాడు. "మా ఇంటికీ వచ్చింది. మా అన్నయ్య ఆఫీసులో మా ఇంటి అడ్రసు కనుక్కుందిట. కాని, మా వదినకి భలే నియమాలుగా! అసలు ఇల్లాంటివాళ్లు, తనవాళ్లూ కుటుంబాలూ లేని ఆడపిల్లలు, సాధారణంగా తగని ఆశలు పెట్టుకుంటారు, సాహసవంతులు, అని ఘంటాపదంగా చెప్పింది. ఈ అమ్మాయిని వచ్చిన పళంగా పంపించేసింది, మా వదిన. అబ్బో! ఈ అమ్మాయి ఏమి గొప్పలు పోతుందనుకున్నారు?'' అంటూ.

"ఏదయినా ఉద్యోగం చేసుకోకూడదూ, ఆ పిల్ల?'' ప్రశార్థంగా అంది, సుశీల, మా సంఘ సేవా దళం కార్యదర్శి - గిన్నెలో గంధం కలుపుతూ.

"ఉద్యోగం చేసే రకం కాదు,'' అన్నాడు కుమార్. కాస్త కారంగా.

"పచ్చని పచ్చడంబు భుజముపై జార....!'' దీర్ఘంగా కూనిరాగం తీసాడు, అంత పట్టించుకోకుండానే, కళాకారుడు మధు.

"అవును. నిజమే, అదేమిటే? ఆ పిల్ల ఎప్పుడూ అంతే. అల్లా పంవిట కొంగు భుజంమీదనించీ ఒయ్యారంగా జారవేసుకొనే తిరుగుతుంది. తను ఏదో

మహా రాణీ ననుకుంటోందేమో. తన మనస్సులో!'' అందుకున్నాడు కుమార్, "చెబుతున్నాగా. ఎప్పుడూ అదే స్టైల్!''

"అది గది! వినండయ్యా! వినండర్రా! ఈ త్రాష్టం ఆ పిల్ల వెనకాలే తిరగడం పరమావధి అనుకున్నాడెల్లె ఉంది. ఎప్పుడూ అదే స్టైలులో చీర సింగారిస్తుందని వీడికి నిశ్చయంగా తేలింది! గమనించండి, ఆ మాట! ఎప్పుడూ! విన్నారా. ఎప్పుడూ అదే స్టైలు!" వ్యాఖ్యానించాడు ప్రభాకర్, చిరునవ్వుతో-అర్థయుక్తంగా కన్నుకొడుతూ.

అతని చెల్లెలు షర్మిళ సమ్మేళనంలో జొరబడ్డది. గులాబి పువ్వు వాసనచూస్తూ, వీధిలోకి చూసి, "అదిమాత్రం నిజమేప్రభూ. ఆ అమ్మాయిని నేను చాలా వీథుల్లో చూశాను. ఎప్పుడూ అల్లాగే కడుతుందా చీర-జారిపోతుంటూను. నన్నడిగితే అతి సోమరితనం అంటాను." అంది.

"ఆగు చెల్లీ! ఆగు! నువ్వు తొందరపడి అభిప్రాయాలు చెప్పకు మరి. ఆవిడ తీరే అదొక స్టైలు! అదొక రకపు అందమే! అది మాత్రం నిజం! కాని, ఆ వాలు చెంగులున్నవే, ఆవిడవి అవ్వి మాత్రం ఆఫీసు పనిలో పనికి రావు. వ్రాతకీ కోతకీ అడ్డే." అని తన అభిప్రాయం వెల్లడించాడు, ప్రభాకర్.

"మరే, ఏమీ ఒబ్బిడంగా ఉండదు కూడాను, ఆ కట్టూ. ఆ పటవిటాను!" శ్రుతి కలిపింది మా సంఘసేవకి.

"ఏదీ, నన్ను చూడనియ్యండి," అంది చిత్రకారిణి, దివ్యప్రభ, సగం తింటున్న తీపి భక్షణం చేత పట్టుకుని-ఈజీచెయిర్ లోంచీ లేచి, బయటికి చూస్తూ. ''అరెరె! ఎంత అందంగా ఉందో నిజంగా, చిత్రం లాగుంది గదూ?-ఆ సూర్యకాంతి వెనక నించీ పడుతూ-ఆ తీర్చి దిద్దిన రంగుల సమ్మేళనం! భలే!' ఆలాపించింది, ఇంచు మించు స్వగతంలాగా.

"కాస్త ఇటు వినడంర్రా. మొన్న ఒకనాడు ముఖమంతా చెమటలు కారుతూ, నడుస్తూ పోతూంది ఈపిల్ల, ఎర్రటి ఎండలో. నాకు అయ్యో పాపం అనిపించింది. వట్టి కనికరంవల్ల సుమా, నే నన్నది, నమ్మండి. నా కారులో లిఫ్ట్ ఇస్తానన్నాను. ఎక్కడి కెళ్ళాలో చెప్పండి అక్కడే దించేసి పోతానన్నాను. అదయ్యా వచ్చిన తప్పు. ఆ త్రిలోకసుందరి శశేమిరా వద్దన్నది. పైగా, నాకేసి చూసింది గదా ఒక చూపు! నే నేదో ఒక పెంటపోగు నన్నట్టూ-ఒక విరసనమైన చూపు విసిరిందంతే! ఛ!ఛ!

ఈనాడు నేను వ్రాసి ఇస్తాను. ఆ పిల్ల ఎన్నటికీ బాగుపడదు. పాడైపోతుంది. ఈ రకాలున్నారే, ఆఖరుకి ఏ ఫిల్ము ఎక్స్ట్రాగానో, ఇంకా అధ్వానంగానో అల్లాంటి దేదైనా అయి ఊర్కుంటారు. అంతే!'' అన్నాడు ఏకధాటిగా. సుశీల దాయాది అన్నగారు, క్రిష్ణ, యతీశ్వరుడల్లే తల పంకిస్తూ, కళ్లు సన్నగా మూసుకుని, ముఖం చిట్లించి, వస్తూన్న ఆ అమ్మాయికేసే చూస్తూ.

"పాపం, దిక్కులేనిపిల్ల కాబోలు. పెద్దవాళ్లెవ్వరూ లేరను కుంటాను!'' అప్రయత్నంగా అనేసింది, దివ్యప్రభ.

"అవునవును. అది మాత్రం నిజమే. అందువల్లనే ఆ పిల్ల చదువు సంధ్యలు కడతేరకుండా మధ్యనే ఆపెయ్యాల్సి వచ్చిందట కూడాను.' అన్నాడు అంతవరకూ మౌనంగా ఉన్న సూర్యారావు, ఖచ్చితంగా.

"అదిగట్లాంచెప్పవేం? ఏమర్రో, వినండి, వినండి, అందరూ. విన్నారా ఆ మాటలు? అవునూ, నామూగిసోదరా, ఇన్ని తబిశీళ్ళు, ఎప్పుడు సంపాదించావు? అసలు ఇవన్నీ నీకెట్లా తెలిసినయి ?'' ముసి ముసి నవ్వులతో అడిగాడు ప్రభాకర్.

"నోటికొచ్చినట్టూ మాట్లాడకు, దయాదాక్షిణ్యాలుఏమాత్రమూ లేకుండా." మందలించింది, అతని చెల్లెలు.

"అవును, అన్నట్టూ మీనాన్నగారి ఆఫీసులో ఏదయినా ఉద్యోగం అడిగి ఇప్పించకూడదూ నువ్వు?" అడిగింది, దివ్యప్రభ. నాకేసి చూస్తూ, కొరకబోతున్న భక్షణం చేత పట్టుకుని, "ఆయన తల్చుకొంటే ఇవ్వవచ్చు.'' అంది తిరిగి.

"అది మంచిదే. ఆట్లా చేస్తే చాలా బాగుంటుంది.'' గొంతు కలిసింది, సైరాబానో, తన తలమీద తానే పన్నీరు జల్లుకుంటూ.

ఈ గొడవ ఇక భరించలేకపోయాను. గుచ్చబోతున్న పువ్వులు ఒళ్లోనించీ క్రిందికి జారవిడిచి, చటుక్కున లేచి, క్రిందికి చరచర దిగి వెళ్లిపోయాను.

"అవును. కేపిటల్ అయిడియా! మీ నాన్నని అడుగు." అరిచాడు ప్రభాకర్ నా వెనకనించి.

నేను మేడ మెట్లనించీ దిగుతూండగానే, ఎదురుగా, గుమ్మంలోంచి, వీధివెంట వెళుతూన్న ఆ అమ్మాయి కనిపించింది.

నన్ను చూడగానే, ఆపిల్ల కాస్త తటపటాయించి, నడక వేగం తగ్గించింది.

నెమ్మదిగా చిరునవ్వు నవ్వింది.

ఆవిడ కళ్ళల్లో కల్లాకపటం లేదు. పైగా, నామీద ఎంతో నమ్మకం కలిగినట్టూ, ఆ చూపులో పొడగట్టింది. నాకు–నేను ఎన్నాళ్ళనించో తనకి తెలిసి ఉన్నట్టు.

నేనూ, పలకరింపుగా ఒక చిరునవ్వునవ్వి, లోపలికి ఆహ్వానించాను. జంకూ, బెంకూ లేకుండా వెంటనే వచ్చేసింది.

గుమ్మంలోంచీ నడిచి వస్తున్న ఆవిడ వెనకనించీ ప్రొద్దుటెండ చొచ్చుకొస్తోంది. ఆ ఎండకి, ఆ పిల్ల కనకాంబర రంగు చీర ఎరుపు కలసిన పసుపు వెలుగులు, నేను నించున్న నడవా అంతా అలుముకున్నాయి.

"ఈ చీర చాలా బాగుంది'' అన్నాను అప్రయత్నంగా, మనస్సులో ఉన్న మెప్పుతో.

ఎంతో కలుపుగోలుతనంగా, చిన్నగా నవ్వింది, ఆ అమ్మాయి. "అవును. ఇది నాకుకూడా చాలాఇష్టమే. చక్కటి సూర్యాస్తమయం జ్ఞాపకం వస్తుంది. దీని రంగు చూస్తే.'' అంది చీరకేసి చూసుకుంటూ.

"మన ఇద్దరికీ అభిరుచులు ఒక్కటే లాగున్నాయి,'' అన్నాను నేను–స్వతంత్రంగా. "ఎక్కడ కొన్నారు మీరిది?'' అడిగాను.

"పోయిన పుట్టినరోజు పండగకి, నా కోసం మా అమ్మ కొన్నది." అన్నది అమ్మాయి.

"అల్లాగా. ఎంచక్కటి చీర ఎన్నగలిగారు మీ అమ్మగారు!'' మెచ్చుకొన్నాను నేను మనసారా.

"ఆ గాజులు? ఆ గాజు లెంత బాగున్నాయో! ఆ చీరకి సరిపడ్డ రంగు–ఎంచి పెట్టి నట్టు." అనేశాను నేను దాపరికం లేకుండా.

"ఇవి అద్దపు గాజులు. ఇందాకనే కొన్నాను. చీర రంగుకి సరి పోవడం అల్లా ఉంచి, వాటంతట అవ్వే బాగున్నాయి గదూ?'' అంది, ముఖంలో చిరునవ్వు మరికాస్త స్పష్టమవుతూ, "చాలా చౌక కూడా,'' అంది.

ఈ పిల్లనేనా అందరూ నిర్దాక్షిణ్యంగా గర్వి, అతిశయ పరురాలు, బడాయి కోరు అన్నది-క్రిందటి క్షణం వరకూ!

మేడమీద పండుగ కూటమిలోనించి నవ్వుల కలకలలూ, కూనిరాగాలు సందళ్ళూ గాలిలో తేలుతూ వినవస్తూన్నాయి.

నేనుమాత్రం రెప్ప వెయ్యకుండా ఆ గాజులకేసే చూస్తూ ఉండిపోయాను. ఆ అగ్నిశిఖ రంగు నన్ను మైమరపించింది.

చూపు కందని గతించిన దూరపు కాలాల్లో, యుగయుగాల క్రితం ప్రాచీన సముద్రతీరాలలో నిగనిగలాడే రంగు గుల్లలు ఏరి తనని అలంకరించుకున్న తొలి అవ్వ-మా పురాతన తల్లి-ఆ పిల్లకీ నాకూ అది ముత్తవ-ఆ నిరంతర స్త్రీ-ఆ క్షణం నా కనుదోయి నించి అంది చూసింది. నా నాగరికపు పెంపకమంతా మటు మాయ మయింది. కళ్లప్పగించి, అదేపనిగా ఆ అందాల గాజులకేసే చూస్తూ ఉండిపోయాను.

"ఇవి నాకు కూడా చాలా ఇష్టం." అన్న దా పిల్ల, తన వాళ్లతో మాట్లాడేంత స్వతంత్రతతో. ఆ సమయంలో మా ఇద్దరి మధ్యా దాపరికా లేమీ లేవనిపించింది. అక్కాచెల్లెళ్లలా గున్నాము.

అప్రయత్నంగా ఆ పిల్ల నాకేసి చెయ్యి చాచి తన వేళ్లల్లోనించీ వ్రేళ్లాడవేసి పట్టుకున్న అరడజను గాజులూ నా కందించింది. "మీరు తీసుకోండి" చిరునవ్వుతో అన్నది. బహుశా ఎప్పటికైనా తనకే ఉపయోగిస్తాయని కొనుక్కుని ఉంటుంది. తను ఆ గాజులు.

తనకున్నదానిని, తక్షణమే, అంత సరసతతో, ముందు వెనుకలు తెలియని నాకు ఇచ్చెయ్య గలిగిన ఆ పిల్లమీద ప్రేమ, కృతజ్ఞత పుట్టుకొచ్చినయి నాకు. చిరునవ్వుతో "అభివందనా''లన్నాను- హృదయపూర్వకంగా-గాజు గాజులు చేతిలో భద్రంగా పట్టుకొని.

"వెల ఎంత అయితే మాత్రమేం? అందమైనా ఉండాలి వస్తువుకి ఉపయోగమైనా ఉండాలి. అది చాలు నా ఉద్దేశంలో,'' అన్నాను నేను గాజులు చూసుకుంటూ.

"అవును. నా అభిప్రాయమూ అంతే,'' ఒప్పేసుకుంది, వెంటనే. ఆ పిల్ల చిరునవ్వుముఖంతో.

ఉన్నట్టుండి నాకు ఒక ఆలోచన తట్టింది, చటుక్కున. "ఇవ్వి నాకెందుకు ఇచ్చేస్తున్నారు? ప్రపంచం అంతటిలోనూ నేను మాత్రమే వున్నానా?' అడిగేశాను ఇష్టాగోష్ఠి ధోరణిలోనే.

"మీరంటే నాకిష్టమయింది గనుకనే. నా కిష్టంలేనివాళ్ళతో నేను మాట్లాడనైనా మాట్లాడను. నా నైజమది." జవాబిచ్చింది. నా ముఖంకేసి చూస్తూ. ఆవిడ కళ్ళల్లో గాంభీర్యం పొడ చూపింది. చిన్నతనమే కనిపించలేదు-ఆసమయంలో.

కాస్త ఆగి, "మీ గుణం ఇంత మంచిది. మీకు మంచి ఉద్యోగం దొరకాలని నా ఆశ." అనేశాను - స్వతంత్రంగా - ఈ అమ్మాయి విషయం. నాన్నగారికి ఏవిధంగా నచ్చచెప్పాలా అని లోలోపల ఆలోచించుకుంటూ.

"మంచిపెద్దలలో నాకు ఇంకా విశ్వాసం తగ్గలేదండీ,' అంది అదే గంభీర స్వరంతో.

"ఎల్లాంటి ఉద్యోగమైనాసరే మొట్టమొదట ఒప్పేసుకోండి,' సహృదయతతో సలహా ఇచ్చాను - మనస్సులో నాన్నగారి ఆఫీసు స్థానబలాలు పరికిస్తూ.

"ఊఁ! హా!... అల్లాకాదండీ. ఆ ఉద్యోగం ఎలాంటిదో తెలుసుకోవాలిగా. ఒప్పుకోకముందు. ఉద్యోగం నాకు తగినదయితే తప్పకుండా ఒప్పేసుకుంటాను. ఏదైనా. ప్రతి విషయమూ... బాగా నేను చెయ్యగలనా... అన్నీ చూడాలి...' అంది ఆగి ఆగి. ఆవిడ మాట కడ్డువస్తూ, చాలా సౌమ్యంగా. "ఇంట్లో సంపాదించే వాళ్ళు మరెవ్వరూ లేరనుకుంటాను?'' అడిగాను. ఆవిడ భవిష్యత్తూ, క్షేమమూ నావే ననిపించింది నాకు.

"అవును, నా తల్లి తప్ప నా కెవ్వరూ లేరు,'' అంది ఒక్కక్షణం ఆగి, "ఆవిడా ఇప్పుడు పక్షవాతంతో పడుకుంది," తిరిగి-నిట్టూరుస్తూ, దుఃఖం మింగిన స్వరంతో అన్నది.

నా హృదయం కరిగి నీరైపోయింది. "అయ్యెయ్యో! పాపం! దారుణం.'' అన్నాను, సానుభూతితో, చిన్నస్వరంతో.

ఆ పిల్ల గబుక్కున నా చేతిగడియారంలో టైము చూసింది.

"నాకు ఒక రెండు రూపాయలు అప్పుగా ఇవ్వగలరా?" అడిగింది- ఇంక

వ్యవధి లేదన్నట్టు, తొందరతో. ఆతురత ఉన్న దా స్వరంలో. "నే నెవ్వరినీ అడగను. ఇంతవరకూ అడగ లేదు." కాస్త నిదానంగా అంది, మళ్ళీ.

"అంతకంటేనా! తప్పకుండాను!" జవాబిచ్చాను. అసలు ఆమెకి ఏమికావాలో అది ఉన్నపాటున ఇచ్చెయ్యాలని సంకల్పించు కున్నాను నా మనస్సులో నేను.

మరు క్షణం. నా మనస్సులో ఆలోచనలు తట్ట నారంభించినయి, చటుక్కున. సహజసిద్ధమైన జ్ఞానం మరుగుపడి పోయింది. ఈ సహజ జ్ఞానంవల్లనే ఆ పిల్ల నన్ను నమ్మింది. నాకుమాత్రం ఆసమయంలో నాగరకపు తెలివితేటలు మనస్సు నలుముకున్నాయి. ఆ సమావేశం యావత్తూ ఒక స్వప్నరూపంలో కనిపింపసాగింది నాకు. ఆ పిల్ల అపరిచితురాలు నాకు, దానకర్ణుడికంటె పై చెయ్యి. కనికరపు స్వభావంగలదే, అయినా, ఏదో దొరికిన ఉద్యోగం రెండు చేతులా అందుకోకుండా మీనం – మేషమూ చూడాలంటోంది, పైగా, ముందువెనకలు తెలియని నన్ను రెండు రూపాయలు అప్పడిగె!

మనసులో, చిన్న భారం తోచింది నాకు. అప్రయత్నంగా, వినీ వినబడని స్వగత స్వరంలో "పాపం! పిచ్చిపిల్ల! నిజంగానే కాస్త మతి స్తిమితం తప్పింది!" అన్నాను.

ఆవిడ నొచ్చుకుంది. ఆ పిల్ల మనస్సు నేను నొప్పించేశాను. ఇంతా అంతా కాదు. ఆ పిల్ల హృదయం తీవ్రంగా గాయపర్చాను. తక్షణం ఆ అమ్మాయి కళ్ళల్లో రంగులు మారినయి. రక్తం ముఖానికి ఎగబ్రాకింది. పచ్చని బుగ్గలు ఎర్రబడినయి. పలుచని ముక్కోళ్ళు చిన్నగా విసురుగా స్పందించినయి. ఇహ నిప్పుడు ఏమీ చెయ్యలేను. పాముకాటులా ఒక్క త్రుటిలో జరగవలసినది జరిగి పోయింది. అప్పటికి నాకు అనుభవం తక్కువ. మానవ జీవిత వ్యథలు నా కింకా అవగాహన కాలేదు.

"నేను పిచ్చిదానను కాదు సోదరీ!" అనేసింది గబుక్కున, ఇంగ్లీషులో–ఉత్సాహమూ, ఉద్రేకమూ ఏమీ లేకుండా, "నాకా ఉబ్బుకావాలి. అందుకని అడిగాను. ఈ వేళ నా పుట్టిన రోజు. పందొమ్మిది సంవత్సరాలు నిండినయి. మా అమ్మ నాకు పండుగ చేసి ఆశీర్వదించాలనుకొంటూంది. వచ్చే పుట్టినరోజు వరకూ తను బ్రతక ననుకుంటుంది.'' అనేసింది. ఆవిడ భాషాప్రయోగమూ, ఉచ్చారణా చూస్తే, చిన్నతనంలో మహా మంచి అంతస్తుగల స్కూల్లో చదివిందని తెలుస్తోంది.

క్రోటనువెుక్కల మీద నించీ చిరుగాలి ఒకటి చిన్నగా విసిరింది లోపలికి-చలిగా.

ఆవిడ భుజం మీద నించీ వ్రేళ్ళాడుతూన్న పవిటకొంగు చిన్నగా ఆడింది ఆ గాలికి.

మరుక్షణంలో, సొగసుగా క్రిందికి దిగజారుగా వ్రేళ్ళాడుతూన్న పవిటకొంగుని, ఉద్రేకంగా, రెండోచేత్తో, ఒక్కసారిగా పైకి కూడ తీసుకుంది. కాని, తన్ని తాను గుర్తు తెచ్చుకున్నట్టూ, వెంటనే. అంత చటుక్కునా, తిరిగి పవిట దిగవేసుకుంది.

ఆ ఒక్క కనురెప్పపాటులో నాకంట బడ్డది నిజం.

ఆ పవిట చెంగు క్రింద చెయ్యిలేదు! ఉన్నది. భుజం దగ్గర ఉన్న ఒక చిన్న మొండి మొద్దు మాత్రమే!

తిరిగి యథాస్థానంతో వ్రేళ్ళాడుతూన్న పట్టు పవిుట బంగారు సెలయేరులో మిసమిస లాడింది ఎదురెండకి.

"నేను పైన-తీగెమీద నాట్యమాడుతూ క్రిందికి పడిపోయాను. చెయ్యిదెబ్బ తగిలింది. శస్త్రంచేసి చెయ్యి తీసేశారు. తరువాత ఆ సర్కస్సు ఊరువదలి వెళ్ళింది," అనేసింది అదే స్వరంలో.

వెంటనే గిరుక్కున తిరిగి చరచర బయటకి వెళ్ళిపోయింది.

ప్రొద్దుటెండకి ఎదురుగా, కదులుతున్న ఆమె చీరచుట్టూ కుంకుమా పసుపూ కలిసిన రంగుల జ్యోతులు వెలిగినట్లనిపించింది.

నేను తెప్పరిల్లి మతి తెచ్చుకున్న వెంటనే, ఆవిడ వెనక పరిగెట్టాను - ఆ గాజులు అల్లాగే చేతులో పట్టుకొనే. చాలా సేపు వెతికాను, ఆ పిల్లకోసం.

ఎక్కడా జాడైనా కనబడలేదు.

గంటలు గడచినయి. అమ్మ నానుదుట కుంకుమ పెట్టింది. ఆనందం పట్టలేకుండా పెద్దగా పాటలు పాడుతున్నారు, నా చుట్టూ మూగిన బంధుమిత్రయువక బలగమంతా. నా హృదయంలో మట్టుకు భారం ఎక్కువయింది. అమ్మ వెండిపళ్లెం లో కర్పూరం వెలిగించింది - నన్నాశీర్వదించటానికి నాకళ్ళముందరికి హారతి పళ్లెం తెచ్చింది.

కర్పూరజ్యోతి ఊర్ధ్వముఖంగా వెలుగుతూంది-సింధూర ఛాయలు అలదుకొన్న కరిగిన అపరంజి తునకలా. కాని నా కళ్ళల్లో మాత్రం, వెళ్లిపోతున్న ఆ పిల్ల పట్టు పఁవిటుకొంగు అలలే అలుముకొన్నాయి. అలలు కదలిపోతున్నాయి. నాకు దూర దూరంగా కదిలి పోతున్నాయి. గొంతులో ఏదో అడ్డుపడి నట్టయింది నాకు. కళ్లు చెమ్మగిల్లినయి.

★ ★ ★ ★

కాలం గడుస్తోంది. ఈనాడు నేను బిడ్డల కన్న తల్లిని.

ఆ కనకాంబర రంగు అద్దంగాజులు మట్టుకు పాతనగల చందనపు పెట్టెలో భద్రంగా దాచుకున్నాను.

ఏనాటికైనా, ఎప్పుడో నా బిడ్డలు ఆ పెట్టె తెరిచి చూస్తారు. నాపూర్వీకపు ముత్తవ్వల చిన్నారి చితక గట్టి బంగారపు నగల బరువులమధ్య, ఈ చవుకబారు మట్టిగాజులు ఏమిటో అని ఎంత ఆశ్చర్యపడతారో! వాళ్ళకేమి తెలుస్తుంది. ఆ గాజులతోపాటు నే నందుకున్న అయత్నకృత అవాజ్యప్రేమ !

ఆ గాజులచుట్టూ అలముకున్న దుఃఖం, గర్వం, ధైర్యం, దయ, అన్నిటినీ మించిన నా అనాలోచిత ప్రవర్తన, ఇవ్వేవీ వాళ్ళకి ఎన్నటికీ తెలియవుగా!

జీవితంలో ఎన్నో పుట్టినరోజులు వచ్చినయి నాకు. వచ్చి వెళ్లి పోయినయి. కాని, ఏ పుట్టిన రోజునా తిరిగి కర్పూరం వెలిగించ లేదు. ఆ కర్పూరజ్వాల నా కళ్ళ ముందరికి రాలేదు.

యేళ్లు గడుస్తూన్నాయి. యేటేటా పుట్టినరోజు వస్తూనే ఉంది. కాని, ఆ పుట్టినరోజు వచ్చేటప్పుడు నాకళ్ళల్లో మెదిలేది. అస్పష్ట దుఃఖం అలుముకున్న ఆ అపరిచిత ప్రేమ మూర్తి ముఖం - గర్వమూ, సున్నితత్వమూ ఉట్టిపడే ఆ లేత ముఖం!

నన్ను నమ్మి నిష్కామప్రేమ చూపిన ఆ ముఖ ప్రతిమ కాలం గడిచినా, కలక బారని తీక్షణతతో, నా స్మృతి పథంలో నన్ను వెంటాడుతూనే ఉంది.

ఇప్పుడా పిల్ల ఏమైనదో! ఏ సీమనున్నదో!

✤ ✤ ✤